క్లుప్తంగా

నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తి

రామభద్రపురం: రైతుల పంటలకు సంబంధించి, ప్రస్తుతం చేస్తున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని వ్యవసాయ సిబ్బంది శనివారం తెలిపారు. మండలంలో ఇప్పటికే 100 శాతం మేర ఈ–క్రాప్ నమోదు, 43 శాతం మేర ఈకేవైసీ నమోదు పూర్తయిందన్నారు.

సన్మానం



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) ఆవిర్భవించి 80 వసంతాలు నిండిన సందర్భంగా స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఆ సంస్థ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా శనివారం సన్మానించారు. అనంతరం గత కొన్నిరోజులుగా ఉపాధ్యాయుల మధ్య నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం సభ్యులంతా పలు తీర్మానాలు చేసి, రాష్ట్ర ఏపీటీఎఫ్ శాఖకు పంపించారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు వై.సత్యం, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలుపత్ర ద్రావణంతో చీడపీడల నివారణ



పలుపత్ర ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

తెర్లాం: పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు పలుపత్ర ద్రావణం ఎంతగానో దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల కేంద్రం అధికారి తులసి తెలిపారు. మండలంలోని నందిగాం గ్రామంలో పలుపత్ర ద్రావణం తయారీపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. వివిధ రకాల పత్రాలను సేకరించి, ద్రావణంగా తయారు చేసుకుని, పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలు, తెగుళ్లు సోకవన్నారు. పెట్టుబడి ఖర్చు తగ్గి, ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం ప్రయోగాత్మకంగా ద్రావణం తయారు చేసి, చూపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ దమయంతి, రైతులు పాల్గొన్నారు.

నీటమునిగిన పంటల పరిశీలన



ఏవీపురంలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని అంబాడ, వెంకటాపురం, నాయిరాలవలస గ్రామాల్లో ఇటీవల వర్షాలకు నీటమునిగిన పంటలను ఏవో మురళీకృష్ణ శనివారం పరిశీలించారు. నాలుగు రోజుల పాటు వరదనీటిలో ఉన్నందున ఏ పంట ఏ మేర దెబ్బతిన్నదన్న విషయం చూసి, పంట రక్షణకు పలు సూచనలు చేశారు. ముందుగా పొలంలోని నీటిని ఆరుబయటకు తరలించాలని తెలిపారు. డీఏపీ, యూరియా ఎకరాకు 50 కిలోల చొప్పున వేసుకోవాలని రైతులకు సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

రాజాం సిటీ: క్రీడలతోనే శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం సాధ్యమని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉపాధ్యాయుల మధ్య శనివారం క్రీడాపోటీలు నిర్వహించారు. పురుష ఉపాధ్యాయులకు వాలీబాల్ పోటీలు, మహిళా ఉపాధ్యాయులకు లెమన్‌స్పూన్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించగా, పలువురు విశేష ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

నీటిని వృథా చేయొద్దు

రేగిడి: తాగునీటిని వృథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.శ్రీచరణ్ సూచించారు. మండలంలోని ఉంగరాడ, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లోని తాగునీటి పైపులైన్లు, కుళాయిలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం ద్వారా ఇంటింటికీ సరఫరా అవుతున్న తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎక్కడ పైపులైన్లకు లీకేజీలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వంతెన బాగుచేయండి

బొబ్బిలి: మండలంలోని పారాది వద్ద వరదలకు ధ్వంసమైన కాజ్‌వే(వంతెన)ను బాగుచేయండి అని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. శనివారం కాజ్‌వే తాత్కాలిక మరమ్మతులు చేపట్టగా, అధికారుల పనితీరుపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. మరోసారి వర్షాలకు పాడవ్వకుండా శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయాలని, కొత్తగా నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

- జాతీయ లోక్‌అదాలత్‌లో 183 కేసుల పరిష్కారం
- సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్‌ఆనంద్ శ్రీనివాస్



రాజాం సిటీ: న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్‌ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ సీహెచ్ వివేక్‌ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, రాజీయే రాజమార్గమని, ప్రతి ఒక్కరూ రాజీమార్గాన్ని అనుసరించాలని కోరారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసుల పరిష్కారంతో పాటు చట్టరీత్యా రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులను కూడా ఉభయపార్టీల అంగీకారంతో పరిష్కరించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు పొందవచ్చన్నారు. ఇదిలా ఉండగా, ఉదయం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 183 కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 11 ఉండగా, క్రిమినల్ కేసులు 151, భార్యాభర్తల తగాదాలు 8, చెక్‌బౌన్స్ కేసులు 6 ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కేసులకు సంబంధించి, రూ.16,33,500 నగదుకు కేసులు పరిష్కరించబడినట్లు న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో రాజాం జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీటీ కృష్ణసాయితేజ, రాజాం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.రామినాయుడు, ప్రభుత్వ న్యాయవాది శెట్టి పోలారావు, ఏపీపీ కిమిడి సూర్యకుమార్, సీనియర్ న్యాయవాది రెడ్డి రామమూర్తి, లోక్ అదాలత్ న్యాయవాద సభ్యులు వైఎస్ శ్రీనివాస్, కె.కొండలరావు, టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, రాజాం, రేగిడి, సంతకవిటి, పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.



బొబ్బిలి: కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

బొబ్బిలి: స్థానిక కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించి, 762 కేసులు పరిష్కరించినట్లు బొబ్బిలి న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ తెలిపారు. పరిష్కారమైన కేసుల్లో సివిల్, ఈపీ, హెచ్ఎండీపీ, చెక్ బౌన్స్, మనోవర్తి, డొమెస్టిక్ వయలెన్స్, సీసీ, పీఎల్‌సీ తదితర కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, సీనియర్ న్యాయవాది వై.షణ్ముఖరావు, న్యాయవాది ఎస్.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేసుకోవాలి



వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం ప్రశాంతి

తెర్లాం: ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేసుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏఎన్ఎం ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన ఆయన.. ప్రతినెలా క్రమం తప్పకుండా వేసుకోవాల్సిన టీకాలు వేసుకోవాలని సూచించారు. వైద్యుల సూచనలు, సలహాలు తప్పకుండా పాటించి, ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాల ఫలితాలపై ఏఎన్ఎం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి పాల్గొన్నారు.

ఏచూరి సేవలు ఎనలేనివి



రాజాం సిటీ: ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజాం సిటీ:

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ ఏచూరి సీతారాం సేవలు ఎనలేనివని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు కొనియాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏచూరి చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాజీవితానికి అంకితమైన ఏచూరి ప్రజల మనిషి అని, ప్రజాసంఘాలకు అండగా ఉంటూ ప్రజాఉద్యమాల బలోపేతానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.వాసు, డివిజన్ కార్యదర్శి డి.రమేష్, ఎ.వెంకటప్పలనాయుడు, బి.నాగేశ్వరరావు, ఎం.రమేష్, వి.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వంగర: సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వంగర: మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. విజయనగరం జిల్లా సీపీఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పి.శంకరరావులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. అగ్రకులంలో పుట్టిన ఏచూరి పేద ప్రజల బాగు కోసం పరితపించారని, ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు గణపతి, డి.రాంబాబు, గంగులు, ఆనంద్, విశ్వనాథం పాల్గొన్నారు.



రాజాం: దోసరిలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రాజాం: రాజకీయాల్లో సీతారాం ఏచూరి ఒక విప్లవ ధ్రువతార అని సీపీఎం జిల్లా నాయకుడు సీతారాం కొనియాడారు. మండలంలోని దోసరి గ్రామంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్వార్థం, పదవి, వ్యామోహం చలామణి అవుతున్న ప్రస్తుత రోజుల్లో స్వార్థం లేని నేతగా ఏచూరికి అన్ని వర్గాల నుంచి ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, పి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 20 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట గ్రామంలో విశాఖపట్నానికి చెందిన మహాత్మాగాంధీ ఆస్పత్రి, విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి యాజమాన్యాలు శనివారం నిర్వహించిన కేన్సర్, నేత్రవైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. మొత్తం 200 మందికి పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేయగా, వివిధ సమస్యలతో బాధపడుతున్న 20 మందిని ఆపరేషన్ల(శస్త్రచికిత్స)కు ఎంపిక చేశారు. మిగిలిన వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కేన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం కొంతమందిని మహాత్మాగాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంకి పుష్పమ్మ, వైస్ ఎంపీపీ పెంకి అరుణ, నాయకులు పి.శేఖర్‌బాబు, ఆర్.అప్పారావు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ హిందీ దినోత్సవం



హిందీ 'అ' అక్షరాకృతిలో కూర్చొన్న విద్యార్థులు

రాజాం:

మండలంలోని పెనుబాక గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావుతో పాటు ఎంఈవోలు యాగాటి దుర్గారావు, బి.ప్రవీన్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు మహేశ్వరరావులు ఈ కార్యక్రమంలో పాల్గొని, హిందీ భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం హిందీ భాష ప్రాధాన్యంపై నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హిందీ 'అ' అక్షర రూపంలో విద్యార్థులు కూర్చొన్నారు.

సోషల్ ఆడిట్‌లో రూ.12,047 రికవరీ

బొబ్బిలి రూరల్: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో చేతివాటం చూపిన 19 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.12,047 రికవరీ చేసినట్లు ఏపీవో లక్ష్మీపతిరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన సోషల్ ఆడిట్ వివరాల వెల్లడి కార్యక్రమ ముఖ్యాంశాలను శనివారం తన కార్యాలయంలో విలేకరులతో వెల్లడించారు. వేతనదారుల మస్తర్లు, పనుల కొలతల్లో తేడాలు నేపథ్యంలో ఆడిట్ బృందం ఆ మేర చర్యలు తీసుకుందన్నారు. కింతలవానిపేట, పక్కి గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా 70 మొక్కలు నాటాల్సి ఉండగా, కేవలం 30 మొక్కలు మాత్రమే నాటినట్లు గుర్తించి, మిగతా మొక్కలు నాటేలా ఆదేశాలిచ్చామన్నారు. ఆడిటర్లకు సహకరించని మెట్టవలస ఫీల్డ్ అసిస్టెంట్ అప్పారావుకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నామని ఏపీవో తెలిపారు.

బై బై గణేశా!



మండల కేంద్రంలోని ముగడ కాలనీలో గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



రాజాం: బొద్దాంలో గణనాథుని ఊరేగింపు ప్రారంభిస్తున్న మంగమ్మ పేరంటాల రజక కమిటీ సభ్యులు

బాడంగి: మండలంలో పలుచోట్ల మండపాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వీధుల్లో గణేశుని ప్రతిమలు ఊరేగించారు. ఊరేగింపు ఆద్యంతం డీజే పాటలకు యువతీయువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రాజాం: మండలంలోని బొద్దాంలో మంగమ్మ పేరంటాలు రజక యూత్ ఆధ్వర్యంలో గణనాథుని ఊరేగింపు శనివారం సాయంత్రం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో గణేశుని దర్శించుకుని, పూజలు చేశారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

రాజాం సిటీ: మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇటీవల మృతి చెందిన విశ్వబ్రాహ్మణ ఉద్యోగ సంఘ వ్యవస్థాపకుడు గురజాపు కృష్ణమాచారి గుర్తుగా పట్టణంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు, పెంకి గౌరీశ్వరరావు, పెంకి చైతన్యకుమార్, పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన

సంతకవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీదుర్గా భారత్ గ్యాస్, సంతకవిటి ఏజెన్సీ వారు వంటగ్యాస్ వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదాలు జరగకుండా, వంట చేసేటప్పుడు గ్యాస్ వినియోగం తక్కువ అయ్యేందుకు పాటించాల్సిన మెలకువలు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.షణ్ముఖరావు, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు ఎ.గణపతినాయుడు, పి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ దొరికాడు..

బొబ్బిలి: పట్టణంలో తన ఎలక్ట్రిక్ స్కూటీ పోయిందని ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన కొన్నిగంటల వ్యవధిలోనే పోలీసులు దొంగను పట్టుకుని, స్కూటీని యజమానికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఎస్.బూర్జవలస గ్రామానికి చెందిన వాసుదేవరావు స్థానిక పట్టణంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం తన స్కూటీని నిలిపి ఉంచి, అక్కడి దగ్గరలోని ఓ చోటకు వెళ్లాడు. కాసేపటి తర్వాత వచ్చి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో లబోదిబోమని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా, జమ్మడవలస గ్రామానికి చెందిన గొట్టాపు రామకృష్ణ అనే వ్యక్తి ఆ స్కూటీని దొంగిలించినట్లు గుర్తించి, పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు. ఆ స్కూటీని యజమానికి అప్పగించామన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీ వార్మింగ్ డే కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వైద్యాధికారులు ఎస్.చలమయ్య, రీనాచౌదరిలు శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 17వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆ రోజు అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రలు పంపిణీ చేయనున్నామన్నారు. 6 నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలందరికీ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాడంగి: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



మెంటాడ: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

బాడంగి: మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కండి లక్ష్మణ ఆకస్మికంగా మృతి చెందగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బాధిత కుటుంబాన్ని శనివారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, సంతాపం తెలిపారు. ప్రభుత్వం పరంగా అందాల్సిన సాయం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, నాయకులు గుంట సంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ అల్లాడ కృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉన్న గొప్ప నాయకుల్లో కృష్ణ ఒకరని, ఆయన లేని లోటు పార్టీకి తీరనిదన్నారు. ఏ అవసరం ఉన్నా తనను కలవాలని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, సర్పంచ్ ధనుంజయనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు ఉత్తరావెల్లి అప్పలనాయుడు, రామభద్రపురం జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మెంటాడ: నారాయణమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

మెంటాడ: మాజీ ఎంపీపీ చలుమూరి అప్పలనాయుడు సతీమణి నారాయణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యలు మండల కేంద్రంలోని వారి స్వగృహానికి శనివారం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో సాలూరు వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, గజపతినగరం జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, సీహెచ్ సన్యాసినాయుడు, రత్నాకర్, మయూరి అప్పలనాయుడు, బాయి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: మండల పరిధిలోని కేఆర్ పురానికి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వి.జనార్దనరావు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సదరు యువతి కనిపించకపోగా, తెలిసిన వారి ఇళ్లల్లో భోగట్టా చేసినా ఫలితం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బొబ్బిలి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐలుగా రమేష్, జ్ఞానప్రసాద్‌లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. వీరిలో రమేష్ స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కాగా జ్ఞానప్రసాద్ ట్రాఫిక్ ఎస్ఐ కావడం గమనార్హం. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని వారు తెలిపారు.